తీరని రుణం.. రైతుల రణం

వరంగల్ జిల్లా కాపులకనపర్తిలో నిర్వహించిన రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

30 వరకే రుణమాఫీ డెడ్‌లైన్

- **ఆ తరువాత ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: ఎర్రబెల్లి**

సంగెం, ఆగస్టు 24 : సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 30 వరకు రుణమాఫీ పూర్తిగా చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. వరంగల్ జిల్లా సంగెం మండలం కాపులకనపర్తిలో శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాయమాటలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. శాసన సభ, పార్లమెంటు ఎన్నికల ముందు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్లు పెట్టి, ఇప్పుడు మాఫీ చేయకుండా రైతులను మోసం చేసిండని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన ఆయన, 40 శాతం మందికి ఇంకా మాఫీ కాలేదన్నారు. పొరపాటు చేశామని మంత్రులు కూడా ఒప్పుకున్నారని తెలిపారు. కాళేశ్వరం, దేవాదుల నీళ్లు లేవని, 24 గంటల కరెంటు ఇస్తలేరని, ఇలాంటి ప్రభుత్వానికి ఎందుకు ఓట్లేశామని ప్రజలు బాధపడుతున్నట్టు చెప్పారు. అర్హులందరికీ రుణ మాఫీ చేయకపోతే రైతులతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పరకాల మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాపులకనపర్తి సొసైటీలో 1907 మందిలో ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలేదని అన్నారు. అదే సొసైటీలో పేరాల సాంబయ్య అనే రైతు రూ.లక్ష చెల్లిస్తే రసీదు ఇచ్చారు కానీ బ్యాంకులో జమచేయలేదని, అందుకు కారకులైన చైర్మన్, సీఈవో, ఉద్యోగులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మాఫీ చేసి.. మాట నెలబెట్టుకోవాలి: చల్లా

ఆత్మకూరు, ఆగస్టు 24 : రైతులందరికీ రుణ మాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన మాట్లాడారు. రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, సగం మందికి కూడా రుణ మాఫీ చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసేదాకా రైతుల పక్షాన బీఆర్‌ఎస్ రణం కొనసాగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పోలీసులు ఇష్టానుసారంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసులు పెడితే సహించేది లేదని అన్నారు.

- **రేవంత్‌రెడ్డిపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు**

రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో శనివారం రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. భువనగిరి, యాదగిరిగుట్ట, మోటకొండూరు, తుర్కపల్లి, బొమ్మలరామారం స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోకు ఫిర్యాదులు అందజేశారు. - యాదాద్రి భువనగిరి

ఈపీసీ ప్రాజెక్టుల రద్దు!

- **సాధ్యాసాధ్యాలపై ఇరిగేషన్‌శాఖ కసరత్తు**

హైదరాబాద్, ఆగస్టు24 (నమస్తే తెలంగాణ): నత్తనడకన కొనసాగుతున్న ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) పనులు రద్దు చేయాలని సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇదే అంశంపై శనివారం జలసౌధలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈపీసీ ప్రాజెక్టుల రద్దు వల్ల వచ్చే సమస్యలు, వాటిని ఎలా అధిగమించాలనే అంశంపై సమాలోచనలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2005 నుంచి 2014 వరకు జలయజ్ఞంలో భాగంగా అనేక సాగునీటి ప్రాజెక్టుల పనులను ఈపీసీ విధానం కింద అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించింది. రాష్ట్ర ఏర్పాటు తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈపీసీ విధానాన్ని రద్దు చేసి, లంప్సమ్ విధానాన్ని పునరుద్ధరించింది. స్వరాష్ట్రంలో చేపట్టిన కొత్త పనులన్నీ లంప్సమ్ విధానంలోనే అప్పగించారు. అప్పటికే ఈపీసీకి విధానంలో అప్పగించిన పనులను కొనసాగించారు. ఈపీసీ విధానంలోని లోపాలు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఆ పనులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ పనులన్నీ రద్దు చేయాలని సాగునీటిశాఖ భావిస్తున్నది.

ప్రజాభవన్ ముట్టడి తథ్యం

- రుణమాఫీకి డెడ్‌లైన్ సెప్టెంబర్ 15
- రైతు ఐక్య కార్యాచరణ కమిటీ అల్టిమేటం
- రైతుల నిరసనకు బీఆర్‌ఎస్ సంఘీభావం
- హాజరైన మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి
- ఆర్మూర్‌లో రైతుల మహాధర్నా విజయవంతం



ఆర్మూర్‌లో రైతుల మహాధర్నాకు సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రి వేముల, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి, జీవన్‌రెడ్డి

నిజామాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ చెప్పినట్టు సెప్టెంబర్ 15లోపు రైతులందరికీ రూ.2లక్ష లోపు రుణాలను సంపూర్ణంగా మాఫీ చేయాలని ఆర్మూర్ డివిజన్ ప్రాంత రైతులు అల్టిమేటం జారీ చేశారు. లేకపోతే ప్రజాభవన్, సెక్రటేరియేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. షరతుల్లేని రుణమాఫీ, రైతుభరోసా అమలుకు ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని నిజామాబాద్ రూరల్, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల పరిధిలోని రైతులు కలిసి ఆర్మూర్‌లోని మామిడిపల్లి చౌరస్తాలో శనివారం నిర్వహించిన మహాధర్నా విజయవంతమైంది. పోలీసుల ఆంక్షలను దాటుకుని వేలాదిగా రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తారు. 44వ జాతీయ రహదారిని ఆనుకుని ఆర్మూర్‌కు వెళ్లే మెయిన్ రోడ్డులో దారిపొడవునా రైతులంతా ధర్నాలో పాల్గొనడంతో కిక్కిరిసింది. ధర్నా ప్రాంతంలో సెల్‌ఫోన్ జామర్లను ఏర్పాటు చేశారని రైతులు తీవ్రంగా మండిపడ్డారు. జామర్లను తొలగించకపోతే జాతీయ రహదారి ముట్టడిస్తామని హెచ్చరించడంతో పోలీసులు వెనక్కి తగ్గినట్టు తెలిసింది. ఆ తర్వాత సాఫీగానే కార్యక్రమం జరిగింది. రైతుల ధర్నాకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, వామపక్ష పార్టీ నేతలు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి వేముల మాట్లాడుతూ.. ఆర్మూర్ రైతులు పోరాటాలకు పెట్టింది పేరని కొనియాడారు. నమ్మి ఓట్లేసిన రైతులకే రేవంత్‌రెడ్డి సున్నం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీపై అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావులతో కలిసి సర్కారును నిలదీశామని వేముల గుర్తు చేశారు. రుణమాఫీపై రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడినట్టు చెప్పారు. బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ నియోజకవర్గాల్లోని 1,44,636 రైతులకుగాను 51,141 మంది రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయని, మిగతా 93,495 మందికి మాఫీ వర్తించలేదని లెక్కలతో వివరించారు. రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే అన్ని పోరాటాలకు బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు.

ఆంక్షలు దాటుకుని..

రైతు ధర్నాకు ఆర్మూర్ డివిజన్ రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు ఏసీపీని అనుమతి కోరారు.సానుకూల ప్రకటన రాగా రైతులు ధర్నాకు సిద్ధమయ్యారు. కానీ, ధర్నాకు గంటల వ్యవధి ముందు సీపీ కల్మేశ్వర్ ఉత్తర్వులు రైతుల్లో కోపోద్రిక్తులను గురిచేసింది. రైతుల ఆందోళనకు రాజకీయ పార్టీల పేరును ప్రస్తావిస్తూ ప్రకటన విడుదల చేయడంపై రైతులు మండిపడ్డారు. ఆపై సీపీ కల్మేశ్వర్ వచ్చి పోలీసులతో ఆంక్షలు విధించారు. ఆర్మూర్ టౌన్‌లోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ధర్నాప్రాంతం వరకు ఐదంచెల భద్రత, తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బైక్లకు అనుమతి నిరాకరించడంతో రైతులంతా కాలినడకన అక్కడికి చేరుకున్నారు.

ఇది ఆరంభమే

రాజకీయాలకు సంబంధంలేని రైతులంతా ఇంత పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుట్టడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పడుతున్నాయి. ఆర్మూర్‌లో మొదలైన ఈ రైతు ఉద్యమం ఆరంభం మాత్రమే. ధర్నాకు ఆంక్షలుపెట్టి అడుగడుగునా అడ్డుకున్నా వేలాది మంది రైతులు తరలివచ్చారు. ఈ నిరసనతో ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పినట్లయింది.

- ఏ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆర్మూర్

రైతులకు రేవంత్ మోసం

దేశంలో రైతులను నిలువునా మోసం చేసిన ఏకైక వ్యక్తి రేవంత్ రెడ్డే. ఎన్నికల్లో అసత్యాలు చెప్పి, బూటకపు హామీలతో ప్రజలను రేవంత్‌రెడ్డి మోసం చేశారు. రాష్ట్రంపై కనీస అవగాహన లేకుండా పరిపాలన చేస్తున్నారు. బాసర సరస్వతీ సాక్షిగా, ఆర్మూర్ సిద్దులగుట్ట దేవుడి మీద ఒట్టేసి రుణమాఫీపై రేవంత్‌రెడ్డి మాట తప్పారు.

- బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్టీసీ మాజీ చైర్మన్

సెప్టెంబర్ 15 తర్వాత ఉద్యమం తీవ్రతరం..

ఆర్మూర్ రైతులకు ఉద్యమాలు కొత్త కాదు. తెలంగాణ ఉద్యమం, ఎర్రజొన్న బకాయిలు, పసుపుబోర్డు కోసం పోరాటం చేసిన చరిత్ర ఉంది. రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్న రేవంత్‌రెడ్డి షరతులను విధిస్తూ మోసం చేస్తుండటం చాలా బాధేస్తున్నది. రైతులంతా ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పాటై చేపట్టిన ఈ ఉద్యమానికి బ్రహ్మాండమైన స్పందన వచ్చింది. సెప్టెంబర్ 15లోపు షరతుల్లేకుండా రూ.2లక్షలోపు రుణాలను మాఫీ చేయాలని అల్టిమేటం జారీ చేస్తున్నాం. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేసి ప్రజాభవన్‌ను ముట్టడిస్తాం.

- ఇట్టెడి లింగారెడ్డి, రైతు ఐక్యకార్యాచరణ కమిటీ

చార్ సౌ బీస్ రేవంత్‌రెడ్డి

రేవంత్‌రెడ్డి తెలిసో, తెలియకో ఆరు గ్యారంటీల పేరుతో 420 హామీలు ఇచ్చిండు. వాటిని అమలు చేయకపోతే రేవంత్‌రెడ్డిని ఇకపై చార్ సౌ బీస్ అనాల్సి వస్తుంది. కేసీఆర్ హయాంలో 37 లక్షల బ్యాంక్ ఖాతాలకు రుణమాఫీ జరిగింది. ఇప్పుడు ఆ సంఖ్య 50 లక్షల ఖాతాలకు చేరాల్సి ఉండగా, 22 లక్షల ఖాతాలకే పరిమితమైంది. రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదు. రూ.2 లక్షల రుణం రద్దు చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం.

- ప్రభాకర్, రైతు ఐక్య కార్యాచరణ కమిటీ

ఉద్యమ రుచి చూపిస్తం..

ఎలక్షన్ టైంల యాడికి వస్తే ఆడ లోన్లు మాఫ్ చేస్తనని దేవుళ్లపై ఒట్టు వెట్టుకున్నవ్. గిప్పుడు సీఎం అయ్యినంక మా లోన్లు మాఫ్ చేయమంటే కొర్రీలు పెట్టుడు పద్ధతి కాదు రేవంత్‌రెడ్డి. లోన్ మాఫీ అయితదని మేమంతా ఆశతోని ఉన్నం. మాట తప్పి మమ్మల్ని మోసం చేసుడు కరెక్టు కాదు. రైతులను రోడ్ల మీదకు వచ్చేటట్లు చేసినవ్. మేమంతా ఒక్క టైంల. రెండు లక్షల రూపాల లోన్లు మాఫ్ జెయ్యాలే. లేకుంటే మా ఉద్యమ రుచి చూపిస్తం.

-నర్సారెడ్డి, రైతు, ఆలూర్

సీతక్కా.. మా రుణం మాఫీ కాలేదక్కా!

- మంత్రి గ్రామం జగ్గన్నపేట అన్నదాతల ఆవేదన
- సొంతూరులో 1580 మంది రైతులకు అకౌంట్లు
- 318 మందికి మాత్రమే మాఫీ
- లక్ష లోపు పద్దులేనని అసహనం

వరంగల్, ఆగస్టు 24 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.2 లక్షల వరకు ఉన్న రైతుల రుణాలన్నింటినీ మాఫీ చేశామని గొప్పలు చెప్పుంటే.. స్వయానా అదే ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా ఉన్న సీతక్క సొంతూరు జగ్గన్నపేటలో ఎక్కువ మందికి రుణాలు మాఫీ కాలేదు. దీంతో 'సీతక్కా.. మా రుణాలు మాఫీ కాలేదక్కా' అంటూ అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. రుణాలు మాఫీ చేయించుకునేందుకు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ అలిసిపోతున్నారు. పొలం పనులు చేసుకోలేకపోతున్నామని వాపోతున్నారు. కేవలం 20 శాతం మంది రైతులకే రుణాలు మాఫీ అయ్యాయని విమర్శిస్తున్నారు. అది కూడా రూ.లక్ష లోపు ఉన్న రుణాలే మాఫీ అయిన జాబితాలో ఉన్నాయని, రూ.లక్షపైన ఉన్న రుణాలు మాఫీ కాలేదని పెదవి విరుస్తున్నారు. అంతిమంగా.. పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) సొంతూరు ములు గు జిల్లా ములుగు మండలం జగ్గన్నపేటలో రుణమాఫీ పథ కం అటకెక్కిందని రైతులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇక.. జాబితాలో ఉన్న రైతులు బ్యాంకులకు వెళ్లి మళ్లీ లోను కావాలని అడిగితే.. వడ్డీ పైసలు చెల్లిస్తేనే లోను ఇస్తామని బ్యాంకర్లు చెప్తున్నట్టు పేర్కొన్నారు. సీతక్క గ్రామపంచాయతీ పరిధిలో అన్నంపల్లి, సారంగపల్లి, చిన్నగుంటూరుపల్లి, పులిగుండం, ఆరెపల్లి అనుబంధ గ్రామాలున్నాయి. అన్ని కలిపి ఈ పంచాయతీ పరిధిలో 820 కుటుంబాలు, 1750 ఓటర్లు ఉన్నారు. గ్రామపంచాయతీలో 1,580 మంది రైతులకు బ్యాం కు ఖాతాలు ఉన్నాయి. ములు గు జిల్లా కేంద్రంలోని కెనరా బ్యాంకు (దేవగిరిపట్నం), ఎస్‌బీఐ(ములుగు), పీఏసీఎస్(ములుగు)లో జగ్గన్నపేట గ్రామ రైతులు పంట రుణాలు తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడతల్లో చేసిన రుణమాఫీ కేవలం 318 మంది రైతులకే వర్తించింది. మిగతా 80 శాతం మంది రైతులకు ఈ పథకం వర్తించలేదు.

మంత్రుల ఇలాకాలో రైతన్నకు ధోకా

అప్పుడు అయినోళ్లకు ఇప్పుడు కాదన్నరు

నాకు 1:22 గుంటల భూమి ఉంది. 2015లో రూ.30 వేల అప్పు తీసుకుంటే.. కేసీఆర్ సర్కారు 2023లో రూ.40 వేలు మాఫీ చేసింది. ఇంకో రూ.26 వేల అప్పు ఉండె. ఇప్పుడు మొదటివిడతల నా పేరు రాలేదెందుకంటే గతంల మాఫీ అయినోళ్లకు ఇప్పుడు అయితలేవని చెప్తే, మొత్తం అప్పు తీర్పిన. మళ్ల లోన్‌పెంచి అకౌంట్లో జమ చేస్తామని చెప్పిండ్లు.

-దోబె ముత్తయ్య, జగ్గన్నపేట, ములుగు మండలం, ములుగు జిల్లా

అందరికీ మాఫీ చెయ్యాలె

నాకు 1:25 గుంటల భూమి ఉంది. బ్యాంకులో రూ.35 వేలు అప్పు ఉంది. 2023లో కేసీఆర్ ఉన్నప్పుడు రూ.30 వేలు మాఫీ అయినయి. అప్పుడు మళ్లీ తీసుకున్న అప్పు ఉన్నది. రుణ మాఫీ ఫస్ట్ లిస్టుల నా పేరు లేదు. ఎవుసం చేసేటోళ్లు అందరికీ మాఫీ ఇయ్యాలె.

-ఈసం సారక్క, జగ్గన్నపేట, ములుగు మండలం, ములుగు జిల్లా

భట్టి ఊరిలో మాఫీ వట్టిదే

ఆర్థిక మంత్రి గ్రామంలో.. అందని ద్రాక్షగా రుణమాఫీ

ఖమ్మం, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ పాలకుల మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు మాత్రం రైతుల గడప కు కూ డా చేరడం లేదు. రుణమాఫీ ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సొంత గ్రామమైన వైరా నియోజకవర్గంలోని స్నానాల లక్ష్మీపురంలోనూ అనేక మంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఈ గ్రామంలో మొత్తం 232 మంది రైతులు రుణమాఫీకి అర్హులు కాగా కేవలం 94 మందికే రుణమాఫీ దక్కింది. మిగిలిన 138 మందికి స్వల్ప కారణాలను సాకుగా చూపిస్తూ మాఫీ చేయలేదు. దీంతో గత 4 రోజులుగా వైరాలోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లి రుణమాఫీ కోసం మరోసారి దరఖాస్తు చేసుకున్నారు. వైరా మండలం గొల్లపూడి, రెబ్బవరం, పుణ్యపురం, పినపాక, సోమవరం వంటి గ్రామాల్లో అనేకమంది రైతులకు రుణమాఫీ కాలేదు.

మాఫీకాకపోతే ఇబ్బందులే..

నాకున్న రెండెరాల పొలానికి బ్యాంకు నుంచి రూ.90 వేల రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా రూ.2 లక్షల రుణమాఫీలో నా పేరు లేదు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా. ప్రభుత్వం మాఫీ చేయకపోతే మరిన్ని కష్టాల్లో పడతాను. ప్రభుత్వం మా లాంటి పేదలను ఆదుకునేందుకు వెంటనే రుణమాఫీ చేయాలి.

-అమ్మిక కృష్ణయ్య, రైతు, స్నానాల లక్ష్మీపురం, వైరా నియోజకవర్గం

డిప్యూటీ సీఎం ఊర్లో అంతంత మాత్రమే..

నేను బ్యాంకులో రూ.2 లక్షలు రుణం తీసుకున్నా. రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. ఉప ముఖ్యమంత్రి స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో కూడా రుణమాఫీ అంతంతమాత్రంగానే జరిగింది. తక్షణమే ఆయన స్పందించి గ్రామంలో రుణం తీసుకున్న అందరికి మాఫీ చేయాలి. అప్పుడే రైతులకు న్యాయం జరిగినట్టు అవుతుంది.

-అమ్మిక రామారావు, మాజీ సర్పంచ్, స్నానాల లక్ష్మీపురం, వైరా నియోజకవర్గం

కొలువు రాలేదని నిరుద్యోగి ఆత్మహత్య

రాజశేఖర్(ఫైల్)

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 24: ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో నిరుద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. రామ్‌నగర్‌కాలనీకి చెందిన తంగెళ్లపల్లి రాజశేఖర్ బీటెక్ చదివాడు. ఇంటి వద్దే ఉండి ఉద్యోగానికి ప్రయత్నిస్తున్నాడు. ఎంతకీ జాబ్ రాకపోవడం, చదువు కోసం చేసిన అప్పులు పెరిగాయి. శనివారం ఉదయం తండ్రి పనికి వెళ్లగా, రాజశేఖర్ ఇంట్లో ఉరేసుకున్నాడు. కేసు ద ర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

నేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 24: ఉపాధి లేక రాజన్న సిరిసిల్లా జిల్లాలో ఓ నేత కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని కేసీఆర్ నగర్‌లో ఉంటున్న బోయిని సదానందం(36) మరమగ్గాలు నడుపుతున్నాడు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో పనిలేక ఖాళీగా ఉంటున్నాడు. కుటుంబ పోషణ, అప్పులు భారమై ఆందోళన చెందాడు. శనివారం ఇంట్లోనే గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ దవాఖానకు తీసుకెళ్లారు.

రిజర్వాయర్‌లో నీళ్లున్నా.. పారని కాల్వలు

జనగామ మండలం అసలే కరువు ప్రాంతం.. నీరులేక అనేక తిప్పలుపడ్డ ఈ ప్రాంతానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గోదావరి జలాలు తీసుకొచ్చి సస్యశ్యామలం చేసింది. కాల్వల ద్వారా గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపింది. గతంలో ఎక్కడ చూసినా కోనసీమను తలపించిన ఈ ప్రాంతం నేడు బీడువారిన పొలాలతో దర్శనమిస్తున్నది. బొమ్మకూర్ రిజర్వాయర్‌లో నిండుగా నీళ్లున్నా మండలంలోని గ్రామాలకు నీరు విడుదల చేయకపోవడంతో రైతుల పనులు సాగడం లేదు. – జనగామ రూరల్

వయనాడ్ విలయంతో ద్రవించిన హృదయం

- **పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**
- **వయనాడ్‌లో పర్యటన.. 20 లక్షల చెక్కు అందజేత**

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): వయనాడ్ విలయంతో తన హృదయం ద్రవించిందని మంత్రి సీతక్క అన్నారు. వయనాడ్‌లో విలయానికి అతలాకుతలమైన ప్రాంతాలను శనివారం ఆమె పరిశీలించారు. ముండక్కై శ్మశానవాటికలో మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబాల సహాయార్థం సేకరించిన రూ.20 లక్షల చెక్కును అక్కడి ఎమ్మెల్యే టీ సిద్దిఖీకి అందజేశారు. సుమారు రూ.10 లక్షల విలువైన దుస్తులు, నిత్యావసరాలను అందచేశారు. అనంతరం అక్కడి మీడియాతో మాట్లాడారు. పోయిన ప్రాణాలను తీసుకురాలేకపోయినా తనకు అనుబంధం ఉన్న వయనాడ్ ప్రజలకు నైతిక మద్దతు పలికేందుకు వచ్చినట్టు తెలిపారు. విపత్తు బాధితుల జీవితాలను పునర్నిర్మించేందుకు సాయం చేస్తానని భరోసా ఇచ్చారు.

టార్చర్ భరించలేకే గడ్డిమందు తాగిన

- వేరే ఉద్యోగం కోసం ఎన్వోసీకి దరఖాస్తు చేసుకున్నా సకాలంలో ఇవ్వకుండా సతాయించారని ఆరోపణ
- పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట, ఆగస్టు 24: కొత్త ఉద్యోగంలో చేరేందుకు నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వడంలో ఎంపీడీవో, ఎంపీవో అవమానకరంగా మాట్లాడటంతో తట్టుకోలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్టు రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కిష్టారావుపల్లి కార్యదర్శి లంబాడా శ్రీనివాస్ వాపోయాడు. మెదక్ జిల్లా హవేలీ ఘన్‌పూర్ మండలం ఫరీద్‌పూర్‌కు చెందిన శ్రీనివాస్ రాజన్న సిరిసిల్ల జిల్లా కిష్టారావుపల్లి కార్యదర్శిగా బదిలీపై వచ్చాడు. ఉద్యోగం చేస్తూనే గురుకులం జూనియర్ లెక్చరర్‌గా, మున్సిపల్ సీనియర్ అకౌంటెంట్‌గా ఉద్యోగాలు సాధించాడు. గురుకుల జూనియర్ లెక్చరర్‌గా ఈ నెల 28న, సీనియర్ అకౌంటెంట్‌గా సెప్టెంబర్ 3న జాయిన్ కావాల్సి ఉంది. అందుకు సంబంధించి ఎన్వోసీ కోసం కలెక్టర్‌కు 10 రోజుల క్రితం అర్జీ పెట్టుకున్నట్టు తెలిపాడు. ఈ నెల 21న ఎంపీడీవో శశికళ, ఎంపీవో అబ్దుల్ వాజీద్‌కు అర్జీ పెట్టుకున్నానని, ఈ సమయంలో ఇక్కడే సరిగా విధులు నిర్వహించడం లేదు.. అక్కడెట్లా చేస్తావ్? అని ఎంపీవో అసహనంతో మాట్లాడారని, వెంటనే ఎంపీడీవో వద్దకు వెళ్లి తన ఎన్వోసీ ఇప్పించాలని కోరగా కాసేపు ఆగాలని చెప్పడంతో మనోవేదనకు గురై గడ్డిమందు తాగినట్టు తెలిపాడు. స్థానికులు అతన్ని ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఆయన పరిస్థితిని తెలుసుకునేందుకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ఇల్లంతకుంట మాజీ జడ్పీటీసీ వేణు అక్కడికి వెళ్లారు.

కొనుక్కునే పెన్షన్ మాకొద్దు

ఎన్‌ఎంఓపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): నూతన పెన్షన్ విధానంపై కేంద్ర క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం ఏదైనప్పటికీ ఉద్యోగి తన కంట్రిబ్యూషన్‌తో పెన్షన్‌ను కొనుక్కునే విధానాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌ఎంఓపీఎస్) సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ తేల్చిచెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 1970 సెంట్రల్ సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు పాత విధానంలోనే పెన్షన్ ఉండాలని డిమాండ్ చేశారు. ఉద్యోగి తన సర్వీస్‌లో 50% మొత్తాన్ని జమచేస్తే ప్రభుత్వం 20% తీసుకొని మిగతా 30 శాతం ఉద్యోగులకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. 20 శాతాన్ని నష్టపోతామని తెలిసి ఏ ఉద్యోగైనా పెట్టుబడి పెడతారా? అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ విధానంపై కేంద్రం పునరాలోచించాలని కోరారు.

నిజామాబాద్ జిల్లా గన్నారం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న మెగ్యానాయక్ తండావాసులు

విద్యుత్ కోతలపై భగ్గుమన్న ప్రజలు

- **గన్నారం సబ్ స్టేషన్ ముట్టడి**

ఇందల్వాయి, ఆగస్టు 24: తరచూ విద్యుత్తు కోతలపై ప్రజలు భగ్గుమన్నారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలోని మెగ్యానాయక్ తండా వాసులు శనివారం గన్నారం సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. నిత్యం కరెంట్ కోతలు విధిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సహకరిస్తానని ఎస్సై మనోజ్‌కుమార్ హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని తండా వాసులు హెచ్చరించారు.

- **ట్రిపుల్ ఆర్ బాధితుల ఆందోళన**

చౌటుప్పల్, ఆగస్టు 24 : రీజినల్ రింగ్ రోడ్డు కోసం భూములు, ఇండ్లు కోల్పోతున్న బాధితులు శనివారం ఆందోళనకు దిగారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అంతకుముందు హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. ట్రిపుల్ ఆర్ జంక్షన్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. బొంతల చంద్రారెడ్డి, మాటూరి బాలరాజు, బండారు నర్సింహా, బూరుగు కృష్ణారెడ్డి, ఆకుల ధర్మయ్య, చీరిక సంజీవరెడ్డి, బత్తుల శ్రీశైలం, భూ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.